


# నవభూమి

జిల్లా అనుబంధం

13 ఆగస్టు,2025 బుధవారం పేజీలు:8

www.epaper.navabhoomi.in


### ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు నమోదు కట్టుదిట్టంగా

# నమోదు చేయాలి



- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- విద్యార్థుల ఎన్‌రోల్ మెంట్ అధికంగా ఉన్న 237 పాఠశాలల్లో టీచర్ల కొరత రాకుండా చర్యలు
- యూడిఐఎస్‌సి పోర్టల్‌లో పాఠశాల వివరాలను అప్‌డేట్ చేయాలి
- పాఠశాలలో బ్యాగ్ లెస్ డే నిర్వహించాలి
- ఎఫ్ఆర్ఎస్ విధానంలో హాజరు నమోదుపై విద్యా శాఖ అధికారులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్





**ఖమ్మం నవభూమిబ్యూరో, ఆగస్టు 12:** ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎఫ్.ఆర్.ఎస్. ద్వారా హాజరు నమోదు కట్టుదిట్టంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ఎఫ్.ఆర్.ఎస్. విధానంలో హాజరు నమోద పై విద్యా శాఖ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయులకు సెలవు మంజూరు సమయంలో పాఠాలకు ఇబ్బందులు రాకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయుల, చదివే విద్యార్థుల పూర్తి వివరాలు ఎఫ్.ఆర్.ఎస్. లో 3 రోజులలో ఎన్ రోల్ చేయాలని అన్నారు. విద్యా శాఖలో ఉపాధ్యాయులకు జారీ చేసిన డిప్యూటేషన్ పై రివ్యూ నిర్వహించాలని అన్నారు. ఖమ్మం జిల్లాలో 1600 ప్రభుత్వ పాఠశాలల్లో 65 వేలకు పైగా విద్యార్థులు చదువుతుంటే, వీటిలో 237 పాఠశాలల్లో 56 వేల 300 మంది విద్యార్థులు ఉన్నారని, ఈ 237 పాఠశాలల్లో ఎక్కడా టీచర్ కొరత రాకుండా చూడాలని, సాంక్షన్ పోస్ట్ లను పూర్తి స్థాయిలో భర్తీ చేయాలని కలెక్టర్ మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మండలంలో ఉన్న హెడ్ మాస్టర్ లకు ఎఫ్.ఆర్.ఎస్. లో ఉన్న సాంకేతిక సమస్యల పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలకు విద్యార్థులు గైర్హాజరయితే రెగ్యులర్ ఫాలో అప్ చేయాలని అన్నారు. టీచర్లు, విద్యార్థుల హాజరు అంశం అత్యంత ప్రాధాన్యతగా పరిగణించడం జరుగుతుందని అన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఎఫ్.ఆర్.ఎస్. 77 శాతం ఉండటం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సమగ్ర శిక్ష అభియాన్ క్రింద పని చేస్తున్న కాంట్రాక్టు సిబ్బంది పని తీరు మెరుగు పర్చుకోవాలని అన్నారు. 3 నెలల సమయంలో పని తీరు రివ్యూ చేయడం జరుగుతుందని, మంచి ఫలితాలు రాని పక్షంలో చర్యలు తీసుకుంటామని అన్నారు. యూ.డి.ఐ.ఎస్.సి. పోర్టల్ లో పాఠశాల సంబంధించి వివరాలను 15 రోజుల్లో అప్ డేట్ చేయాలని, ఎం.ఐ.ఎస్ ఆపరేటర్లు, హెడ్ మాస్టర్ లతో సమన్వయం చేసుకుంటూ వివరాలను నమోదు చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఆగస్టు చివరి నాటికి అపార్ నెంబర్ జనరేట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే మెరిట్ విద్యార్థులను పీఎంశ్రీ ఫీల్డ్ విజిట్ క్రింద స్పెస్ స్టేషన్ తీసుకొని వెళ్ళేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని అన్నారు. పాఠశాలల్లో ఒక రోజు లిబ్యాగ్ లెస్‌లి డే గా పెట్టాలని, ఆ రోజు పిల్లలతో గ్రూప్ డిస్కషన్, డిబేట్, క్రీడలు మొదలైన వివిధ కార్యక్రమాల అమలు కార్యాచరణ సిద్ధం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారిణి నాగ పద్మజ, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## పాఠశాలల అభివృద్ధి పనులను

# వేగవంతం చేయాలి

- విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలి
- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్





**పాల్వంచ ఆగష్టు 12 నవభూమి ప్రతినిది:** పాల్వంచ లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల అభివృద్ధి కోసం చేపట్టిన పనులను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు సౌకర్యవంతమైన, ఆరోగ్యకరమైన, శుభ్రమైన విద్యావాతావరణం కల్పించడమే లక్ష్యం అని, అందుకోసం ప్రతి పనిని వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ పాఠశాల ప్రవేశ ద్వారం నుండి డైనింగ్ హాల్ వరకు, అక్కడి నుండి వసతిగృహం వరకు విద్యార్థులు సులభంగా, సురక్షితంగా నడవడానికి అనువుగా పాదచార మార్గం (పాత్‌వే) నిర్మాణానికి సివిల్ విభాగం అధికారులను ఆదేశించారు. పాఠశాల ప్రాంగణం అందంగా, ఆహ్లాదకరంగా మారేందుకు చుట్టూ నీడనిచ్చే పెద్ద చెట్లు, వెదురు మొక్కలు నాటడంతో పాటు పండ్ల చెట్లు, ఔషధ మొక్కలను ప్రణాళికబద్ధంగా పెంచాలని సూచించారు. ఈ మొక్కలు విద్యార్థుల ఆరోగ్యానికి, పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడేలా సంరక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని స్పష్టం చేశారు. డైనింగ్ హాల్‌లో విద్యార్థుల సౌకర్యార్థం డైనింగ్ టేబుల్స్, కుర్చీలు ఏర్పాటు చేయడంతో పాటు, వ్యర్థ పదార్థాల సమర్థమైన నిర్వహణ కోసం కంపోస్ట్ పిట్స్ నిర్మాణం, చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేయడానికి ప్రత్యేక బుట్టలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీ సహకారంతో ఇప్పటికే చెత్త బుట్టలను అందుబాటులో ఉంచినట్లు అధికారులు కలెక్టర్ కు వివరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో మునగ, కరివేపాకు వంటి ఉపయోగకరమైన మొక్కలను నాటారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా, వాటి పెరుగుదల కోసం నిరంతర పరిరక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రత్యేకంగా సూచించారు. సిఎస్ఆర్ విభాగం, సివిల్ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న అన్ని అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి, విద్యార్థులకు మరింత మెరుగైన వసతులు కల్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ సుజాత, పాఠశాల ప్రిన్సిపల్ మైథిలి, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, నవభారత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అపోలో ఆసుపత్రిలో సింగరేణి డెస్క్

- కొత్త ఏసీ బ్లాకును ప్రారంభించిన సంస్థ సిఎండి ఎన్.బలరామ్
- సింగరేణి కార్మికులు, రిటైర్డ్ కార్మికులకు సత్వర వైద్య సేవల కోసం ఏర్పాటు



**కొత్తగూడెం ఆగస్టు 12 నవభూమి ప్రతినిధి:** హైదరాబాద్ జూబ్లీహిల్స్ లో అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఆసుపత్రిలో సింగరేణి కార్మికులు, రిటైర్డ్ కార్మికులు, వారి కుటుంబ సభ్యుల సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక డెస్క్ ను సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్, అపోలో ఆసుపత్రుల జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీత రెడ్డి మంగళవారం ప్రారంభించారు. అలాగే కొత్తగా నిర్మించిన ఏసీ ఆసుపత్రి విభాగాన్ని కూడా వారు ప్రారంభించారు. సింగరేణి ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు ఏదైనా అనారోగ్య సమస్యతో ఈ ఆసుపత్రిని సందర్శించినప్పుడు వెనువెంటనే పేరు నమోదు చేసుకొని సంబంధిత వైద్య నిపుణుల వద్దకు వైద్య సేవ ల కోసం పంపించడానికి, ఈ ప్రత్యేక డెస్క్ ను ఏర్పాటు చేశామనీ, దీనివల్ల ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన అవసరం లేకుండా సత్వరమే వైద్య సేవలు పొందే అవకాశం ఏర్పడుతుందని ఆసుపత్రి యాజమాన్యం వారు వివరించారు. సింగరేణి ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయడంపై సంస్థ ఛైర్మన్ సంతోషం ప్రకటించారు. ఇక్కడికి రిఫర్ చేయబడిన ఉద్యోగులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంకా డీన్ డాక్టర్ మనోహర్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అపర్ణ రెడ్డి, సింగరేణి డిప్యూటీ సీఎంఓ కె. బాలకోటయ్య, అపోలో ఆసుపత్రి అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అబ్దుల్ వేజ్ పాల్గొన్నారు

# ఎమ్మెల్సీ ఎన్నికల అక్రమాలపై విచారణ

- ఎమ్మెల్యే కోరం కనకయ్యకు పిఆర్‌టియు వినతి



**టేకులపల్లి ఆగస్టు 12 నవభూమి ప్రతినిధి :** 2024 ఫిబ్రవరిలో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో జరిగిన అవినీతి, అక్రమాలను టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్ళి, నిఘా వర్గాల ద్వారా విచారణ జరిపిస్తానని కోరం కనకయ్య హామీ ఇచ్చారని పి ఆర్ టి యు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్సులు డి. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు ఎమ్మెల్యే కనకయ్యను కోయగూడెం గ్రామంలోని ఆయన ఇంటి వద్ద కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో అతిపెద్ద సంఘముగా చెప్పుకుంటున్న ఉపాధ్యాయ సంఘం బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థికి, ప్రతిపక్ష బి ఆర్ ఎస్ పార్టీ ఎమ్మెల్సీ, ఇతర ప్రైవేట్ వ్యక్తుల ద్వారా కోట్లాది రూపాయల డబ్బులు అందాయని, ఆ డబ్బును ఎన్నికల్లో విచ్చలవిడిగా పంపిణీ చేసినారని, మద్యం సరఫరా చేసారని ప్రచారం జరుగుతోందని, ఈ నేపథ్యంలో వీటిపై నిఘా వర్గాల ద్వారా విచారణ జరపాలని కోరం కనకయ్యకు మెమోరాండం అందించినట్లు వారు పేర్కొన్నారు.

# నేటి తరం విద్యార్థులకు మార్గదర్శి

## డాక్టర్ మారుమూడి ప్రభుదయాల్



**భద్రాద్రి కొత్తగూడెం ఆగస్టు 12 నవభూమి జిల్లా బ్యూరో:** విద్యాశాఖలో ప్రాథమిక విద్యాశాఖ నుండి ఉన్నత, కళాశాల విద్య వరకు వివిధ శాఖల్లో, స్థాయిల్లో నిబద్ధత, నిజాయితీగా విధులు నిర్వహించిన డాక్టర్ మారుమూడి ప్రభుదయాల్ కొత్తగూడెం మండల విద్యాశాఖ అధికారిగా ఈ ఆగస్టు 31న పదవీ విరమణ చేయనున్నారు. తన 33 సంవత్సరాల సర్వీసు కాలంలో ఆకస్మిక సెలవులు తప్ప మరే రకపు సెలవులు వాడకుండా ఏనాడు డ్యూటీలకు ఆలస్యంగా వెళ్లకుండా, అందరి కంటే ముందే వెళుతూ, అందరి తర్వాత తిరిగి వచ్చే నైజంతో పనిచేశారు. ఎవరైనా సరే పేదరికంతో ఇబ్బంది పడుతుంటే వెంటనే స్పందించే దయా హృదయం గల మహా మనిషి. నేడు ఆయన శిష్యులు వేల సంఖ్యలో ఉన్నత స్థానాలలో ఉండడం, ఆయన నేర్పిన విద్యా క్రమశిక్షణ, విలువలకు నిలువెత్తు నిదర్శనం. ప్రతినెల తన జీతంలో కొంతమేర ఖచ్చితంగా బీదలకు కేటాయించడం ఆయన నిత్య కృత్యం. తన పదవీ విరమణ సమయంలోనూ ఎలాంటి కార్యక్రమాలకు, సత్కారాలకు, సన్మాన సభలకు వీలు కల్పించకుండా తన స్వగ్రామంలో ఓ బీద మహిళకు గృహాన్ని నిర్మించే పనిలో మానవతావాదిగా తన వంతుగా కృషి చేస్తున్నారు.

డాక్టర్ ప్రభుదయాల్ స్వగ్రామం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు. తన బాల్యంలో తండ్రి బెంజమిన్ ఉద్యోగం కొంతకాలం నిలిచిపోవడంతో తన చిన్ననాడే అనేక కష్టాలను చవిచూసి, వాటినే పాఠాలుగా నేర్చుకున్న ప్రభు దయాల్ పట్టుదలతో అనేక ఉన్నత విద్యార్హతలను సునాయాసంగా, దీక్షతో సాధించారు. తన చిన్ననాట చెప్పులు లేని కాళ్లతో, సరిగా దుస్తులు లభించని స్థితిని ఇప్పటికీ గుర్తుచేసుకుంటూ, ఆనాడు తాను పడిన ఇబ్బందులు ఇప్పుడు విద్యార్థులు పడకూడదనే తపనతో, తన స్థాయి మేర, తోచినంత స్థాయిలో అప్పటికప్పుడే సహాయం చేస్తున్న వ్యక్తి దయాల్.

1988లో కాకతీయ యూనివర్సిటీలో ఎంఈడి చదివే క్రమంలో తాను సమర్పించిన పరిశోధనా పత్రాలను గురించి తెలుసుకున్న ఆనాటి ఖమ్మం జిల్లా కలెక్టర్ శ్రీమతి లక్ష్మీ పార్థసారథి భాస్కర్ నేరుగా ఎస్సీ హాస్టల్ వార్డెన్‌గా నియమించారు. దెందుకూరులో హాస్టల్ విద్యార్థులతో మమేకమై కేవలం కొన్ని నెలలు మాత్రమే పని చేసిన అనంతరం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నేరుగా గ్రేడ్-2 స్కూల్ అసిస్టెంట్ గా 1993 జనవరిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల టేకులపల్లిలో మొదటగా నియామకమై పిల్లలతో కలిసిపోయి గణితం బోధిస్తూ నేటికీ విద్యార్థుల మదిలో నిలిచిపోయారు. ఆనాడు చదివిన విద్యార్థుల్లో కొందరు నేడు జిల్లా స్థాయి అధికారులుగా పని చేయడం విశేషం. పని నిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణ, నిక్కచ్చి స్వభావాన్ని గుర్తించిన ఆనాటి ఖమ్మం జిల్లా కలెక్టర్ ఆర్నేని గిరిధర్, దయాల్ ను మండల విద్యాశాఖ అధికారిగా, 1998 లో కొంతకాలం మండల అభివృద్ధి అధికారిగా నియమిస్తూ, మండల విద్యా వ్యవస్థను పటిష్ట పరచాలని ఆదేశించడంతో ప్రతి పాఠశాలను సందర్శిస్తూ టేకులపల్లి మండలంలో నూతనంగా 27 పాఠశాలలను 1999లో అధికారుల సూచనలతో ఏర్పాటు చేశారు. మండల అభివృద్ధి అధికారిగా సకల ప్రభుత్వ కార్యక్రమాలను, పథకాలను ఖచ్చితంగా అర్హులకు చేరేలా కృషి చేశారు. నేటికీ టేకులపల్లి మండల ప్రజలకు ప్రభు దయాల్ సుపరిచితుడే. నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఖమ్మంలో నిర్వహించిన రివ్యూ సమావేశంలో టేకులపల్లి మండల ప్రగతిని ప్రశంసించడం గొప్ప విషయం. టేకులపల్లి మండలంలో దాదాపు ప్రతి గ్రామానికి పాఠశాలను ఏర్పాటు చేయడంలో కృషి చేశారు.

ప్రభు దయాల్ పనితీరు, కార్యదీక్షాతత్వాన్ని స్వయంగా గమనించిన ఆనాటి కలెక్టర్ గిరిధర్ భద్రాచలంలో ఆసియాలోనే ప్రథమంగా ఏర్పాటు చేసిన తొలి గిరిజన బిఇడి కళాశాలకు అధ్యాపకునిగా పనిచేయమని ఆదేశాలు ఇచ్చారు. 2000 సంవత్సరంలో బిఇడి మొదటి బ్యాచ్ లో యూనివర్సిటీ పరీక్షల్లో 76 శాతం ఫలితాలు సాధించగా, ప్రభు దయాల్ బోధించిన సబ్జెట్లో 100 శాతం ఫలితాలు సాధించడం పట్ల కలెక్టర్ గిరిధర్ ప్రత్యేకంగా లేఖ రాస్తూ అభినందించారు.

ఐటిడిఏ పరిధిలో గల ఆశ్రమ గురుకుల పాఠశాలల్లో మంచి ఫలితాలు సాధించాలనే తలంపుతో నాటి ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి నటరాజన్ గుల్జార్ ఐటిడిఏ అకడమిక్ మానిటరింగ్ అధికారిగా నియమించడంతో, తనకు కేటాయించిన గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో అవసరమైతే రాత్రుళ్ళు బస చేస్తూ పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలను సాధించారు. దీంతో ఆనాటి ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి నటరాజన్ గుల్జార్ దయాల్ పనితీరును ప్రశంసిస్తూ ఏకంగా సర్వీసు రిజిస్టర్ లోనే ప్రశంసలను రాశారు. గుల్జార్ బదిలీ అయ్యే క్రమంలో గిరిధర్ సూచనతో ప్రభు దయాల్ ను 2004 లో గిరిజన బిఇడి కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ, బిఇడి కళాశాలను అభివృద్ధి చేయాలంటూ ఆదేశించిన మేర, రేకుల షెడ్డులో కొనసాగే బీఇడీ కళాశాలకు మూడంతస్తుల భవనాలను ఐఏఎస్ అధికారుల తోడ్పాటుతో సమకూర్చారు. 100 సీట్లను సైతం 200 సీట్లకు పెంచేలా కృషి చేస్తూ, ప్రతి ఏటా యూనివర్సిటీ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాలకు శాశ్వత గుర్తింపును సాధించారు. ఆనాడు గిరిజన బిఇడి కళాశాల పనితీరును గమనించిన ఇగ్నో న్యూఢిల్లీ వారు బిఇడి కళాశాలకు స్టడీ సెంటర్ ఇవ్వడం ఒక రికార్డు. ప్రభుదయాల్ ఉపాధ్యాయ విద్యలో సంస్కరణలను తెచ్చేలా పలు పరిశోధనా పత్రాలను జాతీయ ఉపాధ్యాయ మండలికి సమర్పించి కళాశాలకు ఎన్సిటిఇ స్థాయిలో ప్రత్యేక గుర్తింపును సాధించడంతో, ఈయన ప్రతిభను గుర్తించిన ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం కాకతీయ యూనివర్సిటీ సెనేట్ మెంబర్ గా నియమించి గౌరవించింది. యూనివర్సిటీ విద్యాభివృదికి సైతం పలు సిఫారసులు చేశారు. తాను చదువుకున్న యూనివర్సిటీలోనే సెనేట్ మెంబర్‌గా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ మెంబర్ గా నియమించబడడం విశేషం.

గిరిజన బిఇడి కళాశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చారు. నాటి కలెక్టర్ శశిభూషణ్ కుమార్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారులు సురేష్ కుమార్, డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, సాల్మాన్ ఆరోగ్యరాజ్ లు ప్రత్యేకంగా దయాల్ కు పూర్తి తోడ్పాటు ఇవ్వడంతో, నియమాలమేర కళాశాలను, నిర్వహిస్తూ కళాశాలకు ప్రత్యేక గుర్తింపును సాధించారు.

2011లో డిప్యూటేషన్ కాలపరిమితి ముగియడంతో మాతృ సంస్థ అయిన కొత్తగూడెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మేదర్ బస్తిలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా చేరారు. 2011లో ఎలాంటి గుర్తింపు, ఎలాంటి సౌకర్యాలు లేకుండా కల్లు కొట్టు బడి అని పిలవబడే అప్పటి మేదర్ బస్తి పాఠశాల స్వరూపాన్ని మార్చివేశారు. పాఠశాలకు అన్ని సౌకర్యాలను సమకూర్చుతూ, పదో తరగతి విద్యార్థులకు రాత్రిళ్ళు సైతం ప్రత్యేక తరగతులను స్వయంగా నిర్వహించి రెండుసార్లు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 100 శాతం ఫలితాలను సాధించారు. పలుమార్లు 90 శాతం పైగా ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు, భవాని అనే విద్యార్థినిని ప్రోత్సహిస్తూ బాసర ట్రిపుల్ ఐటి కళాశాలలో సీటు సాధించేలా చేసి, ఫీజు కట్టి చేర్పించారు.

సాధారణ బదిలీలలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల సిపిఎస్ మధిరకు 2018లో బదిలీ కాబడి, ఆనాడు విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలలో చివరికి ఈ పాఠశాలలో సీట్లు లేవనే స్థాయికి తీసుకువెళ్లారు. పదవ తరగతిలో ప్రతి ఏటా ఉత్తమ ఫలితాలను సాధించడమే కాకుండా ప్రతి ఏటా ఒక బాసర సీటును సాధించి రికార్డు సృష్టించారు. ప్రాథమిక విద్య నోడల్ అధికారిగా మధిర మండలంలో గల సకల ప్రాథమిక పాఠశాలలను క్రమంగా సందర్శించిన ఏకైక అధికారిగా ప్రత్యేక రికార్డు సృష్టించారు. ప్రాథమిక పాఠశాలల నిర్వహణలో గణనీయమైన మార్పులకు శ్రీకారం చుట్టారు. ఆనాటి ఖమ్మం కలెక్టర్ విపి గౌతమ్, దయాల్ పనితీరును ప్రశంసించడం విశేషం. అనంతరం సాధారణ బదిలీలలో 2023 సెప్టెంబర్‌లో రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేరి, చేరిన 10వ తరగతి మొదటి బ్యాచ్ లోనే 95 శాతం పబ్లిక్ ఫలితాలను సాధించి రికార్డు సృష్టించారు. క్రమ పద్ధతిలో రామవరం పాఠశాలను నిర్వహిస్తూ రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు సాధించడంతో, రాష్ట్ర స్థాయి ఉత్తమ హెచ్ యంగా దరఖాస్తు చేయకపోయినా ప్రత్యేక జీవో ద్వారా నాటి విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, దయాల్ ను ఎంపిక చేసి సత్కరించారు. తనకు లభించిన పారితోషకాన్ని రూ.10,000 లను తిరిగి ముఖ్యమంత్రి సహాయ నిధికి వెంటనే చెల్లించి ఉన్నతాధికారులచే ప్రశంసించబడ్డారు. గత సంవత్సరం అక్టోబర్ నుండి కొత్తగూడెం మండల విద్యాశాఖాధికారిగా తనదైన శైలిలో పనిచేస్తూ, ప్రస్తుత కలెక్టర్ జితేష్ వి పాటిల్‌చే ప్రశంసించబడ్డారు. గత నెలలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విస్తృతంగా పర్యటించిన రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా, దయాల్ పనితీరును గూర్చి తెలుసుకొని ఇటీవలే ప్రత్యేక లేఖ ద్వారా ప్రశంసించడం అరుదైన ఘనత. మండలంలో గల ప్రతి ప్రాథమిక పాఠశాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ మెరుగైన పనితీరుకై సలహాలను ఇస్తూ, బీద విద్యార్థులకు కావలసిన సకల విద్యా అవసరాలను తీరుస్తూ తనదైన శైలిలో తన పనులను తానే స్వయంగా నిర్వహిస్తూ మార్గదర్శిగా నిలుస్తున్నారు. పలువురు ఐఏఎస్ అధికారులు దయాల్ పని తీరును ప్రశంసిస్తూ, ఆయన సర్వీసు రిజిస్టర్‌లోనే రాయడం మరో రికార్డు. తనకు ఉన్నదాంట్లోనే అవసరం ఉన్నవారికి సహాయం చేస్తే లభించే ఆనందం మరేరీతుల్లో లభించదంటారు ప్రభు దయాల్. ఎంతగా ఎదిగినా ఒదిగి ఉండే వ్యక్తిత్వం ఆయనది. తన సాదాసీదా బతుకు విధానంతో నేటికీ తన పనులను తానే స్వయంగా నిర్వహించుకుంటూ సింప్లిసిటీకి మారుపేరుగా నిలుస్తున్నారు.

రామవరం పాఠశాలలో 180 మొక్కలను నాటి వాటిని స్వయంగా రోజు పర్యవేక్షిస్తూ పాఠశాల ఆవరణనే ఆహ్లాదకరంగా మార్చి వేశారు. ఆవరణలోనే విద్యార్థులు కూర్చునే రీతుల్లో ప్రత్యేక సిమెంట్ బల్లలను ఏర్పాటు చేశారు. కార్పొరేట్ కు ధీటుగా రామవరం పాఠశాలను నిర్వహిస్తూ పాఠశాలకు ప్రత్యేక గుర్తింపును సాధించారు. విద్య ఒక్కటే తలరాతను మార్చుతుందని విద్యపై పెట్టే ప్రతి పెట్టుబడి ఖచ్చితంగా రెట్టింపు ఫలితాలను ఇస్తుందంటారు. సాధ్యమయ్యే రీతుల్లో కడవరకు సహకారిగా ఉంటూ బీదలకు తోడ్పాటునందిస్తానంటారు ఈ ఇల్లందు ముద్దుబిడ్డ డాక్టర్ ప్రభు దయాల్.

వృత్తిపరంగా పనిచేసిన చోటల్లా తన ప్రతిభతో అంకిత భావంతో ఉత్తమ ఫలితాలను సాధిస్తూనే ఆయా సంస్థలను ఉన్నత స్థానాలలో ఉంచే ప్రయత్నం చేశారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వ లక్ష్యాలను సాధించేవారు. తన వృత్తి ధర్మాన్ని కొనసాగిస్తూనే ప్రవృత్తిగా హైస్కూలు స్థాయి పలు పుస్తకాలు, బిఇడి పుస్తక రచనతో పాటు విద్యాపరంగా అనేక పరిశోధనాత్మక వ్యాసాలను రచించారు. దీంతో పలు జాతీయ సంస్థలు దయాల్ కు జ్యూవెల్ ఆఫ్ ఇండియా, బెస్ట్ ఎడ్యుకేటర్, బెస్ట్ ఆఫీసర్, బెస్ట్ ప్రిన్సిపాల్‌గా పలు అవార్డులను అందించాయి.











## చేపల వేటకు వెళ్లి మృతి చెందిన కుటుంబాలను పరామర్శించిన మల్లు నందిని



**ఎర్రుపాలెం, నవభూమి, ఆగస్టు12:** మండల పరిధిలోని బంజర గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఇటీవల మీనవోలు కట్టలేరు సమీపంలో చేపల వేటకు వెళ్లి మృత్యువాత పడిన కుటుంబాలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని మంగళవారం పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులతోకలిసి బంజరగ్రామా నికి వెళ్లి మృతిచెందిన మూడు కుటుంబా లను పరామర్శించి మృతి చెందిన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మృతిచెందినరాజు, కోటయ్య, సాయి కుటుంబసభ్యులుతమ కుటుంబా లకు న్యాయం జరిగేలా భట్టి విక్రమార్క దృష్టికి తీసుకు పోవాలని,అధికారంతో మాట్లాడి పరిహారం అందించాలని నందినమ్మను కోరారు. ఈ సందర్భంగా నందినమ్మ మృతులకుటుంబసభ్యులతో మాట్లాడుతూ ప్రభుత్వం నుండి పరిహారం అందించేందుకు కృషి చేస్తానని అన్ని విధాల వారి కుటుంబాలకి న్యాయం జరిగేలా అధికారులతో మాట్లాడుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధా కర్ రెడ్డి,ఉపాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి,అను మోలు కృష్ణారావు,వేజెండ్ల సాయికుమార్ ,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలుఉన్నారు.

## తాగునీరు, పారిశుద్ధ్యంపై అధికారులు దృష్టి సారించాలి

### సిపిఐ పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య




**కొత్తగూడెం ఆగస్టు 12 నవభూమి ప్రతినిధి:** కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో త్రాగునీటి సమస్య, పారిశుద్ధ్యంపై అధికారులు ప్రేత్యేక దృష్టి సారించి శాశ్వత పరిస్కారం చూపాలని, శంకుస్థాపనలు పూర్తయిన రోడ్లు, డ్రైన్లు, ప్రభుత్వ భవనాలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సిపిఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య అధికారులను కోరారు. సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్ లో మంగళవారం జరిగిన సిపిఐ కొత్తగూడెం పట్టణ ముఖ్య నాయకుల సమావేశంలో అయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండటంతో పారిశుద్ధ్యం లోపించి ప్రజలు అనారోగ్యం భారినపడే ప్రమాదం ఉందని తక్షణమే అధికారులు ప్రేత్యేక డ్రైవులు ముమ్మరంగా చేపట్టాలని, పట్టణంలో త్రాగునీటి సమస్య ఉన్న వార్డులు, బస్తీలను గుర్తించి సమస్యకు పరిష్కరించాలన్నారు. ఈనెల 16న కొత్తగూడెం పట్టణ ఏఐకెఎస్ మహాసభ నిర్వహిస్తున్నామని, పట్టణపరిధిలోని రైతులు పాల్గొనాలని సూచించారు. దీంతోపాటు యువజన, విద్యార్థి, గిరిజన సమాఖ్య, ఏఐటీయూసీ పట్టణ మహాసభలు నిర్వహించబోతున్నామని ఈ మహాసభలను ఆయా సంఘాల పట్టణ బాధ్యులు విస్తృతంగా ప్రచారం నిర్వహించి సభలను విజయవంతం చేయాలనీ సూచించారు. గెడ్డాడు నగేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు మాచర్ల శ్రీనివాస్, నేరెళ్ల రమేష్, భూక్యా శ్రీనివాస్, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి కేసులో ఇద్దరికి 20 ఏళ్లు జైలు శిక్ష

- ఒక్కొక్కరికి 2 లక్షల జరిమానా
- మొదటి అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు తీర్పు
- ప్రాసిక్యూషన్‌కు సహకరించిన అధికారులను అభినందించిన పోలీస్ కమిషనర్

**ఖమ్మం క్రైం, నవభూమి, ఆగస్టు 12 :** గంజాయి తరలిస్తూ పట్టుబడిన ఇద్దరికి 20 ఏళ్లు కఠిన కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రెండు లక్షల జరిమాన విధిస్తూ మొదటి అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కె. ఉమాదేవి తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. జల్సాలకు అలవాటు పడి అక్రమార్జన కోసం 2021ఏప్రియల్ 28న మోతుగూడెం నుండి కారులో 30 లక్షల విలువ చేసే 200 కేజీల గంజాయి రవాణా చేస్తూ ఖమ్మం సమీపంలోని వి. వెంకటపాలెం వద్ద పోలీస్ చెక్ పోస్ట్ ఉందని, వేగంతో కారు నడుపుకుంటూ ప్రయాణికులతో కూడిన ఆటోను బలంగా డీ కొట్టడంతో ఆటో, కారు బోల్తా పడ్డాయి. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదంలో మృతి చెందిన ఆటో ప్రయాణికుడిని మార్చురికి, గాయపడిన వారిని ఆసుపత్రి తరలించారు. అనంతరం కారు పరిశీలించగా 200 కేజీల 100 గంజాయి ప్యాకెట్లు లభించాయి. ఇద్దరు నిందితులను అదుపులో తీసుకోగా మరో నిందుతుడు పారిపోయాడు. నిందుతులపై రఘునాథపాలెం పోలీస్ స్టేషన్లో ఎండిపిఎస్ యాక్ట్, 1985 చట్టం, పలురకాల కింద కేసు నమోదు చేసిన పోలీసులు ప్రస్తుతం హైదరాబాద్‌లోని దుండిగల్, గండిమైసమ్మ ప్రాంతంలో నివసిస్తున్న నిందుతుడు మల్లేష్ అలియాస్ నాయక్ మల్లేష్ ,, గద్వాల్, మహబూబ్‌నగర్ జిల్లా తో పాటు గడ్డం బువన్ అలియాస్ యెరుగుంట్ల రవితేజ, జగిత్యాల జిల్లా కోరుట్ల ను అరెస్టు చేసి సమగ్ర దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. పరిశీలించిన న్యాయమూర్తి నిందితులపై మోపిన అభియోగం రుజువు కావటంతో పైవిధంగా తీర్పు చెప్పారు. హైదరాబాద్ దిండిగల్ గాంధీమైసమ్మ ప్రాంతానికి చెందిన మరో నిందుతుడు ఇషాక్ పరారీలో వున్నాడు. ప్రాసిక్యూషన్ కు సహకరించిన విచారణ అధికారలు అప్పటి ఇన్స్పెక్టర్ పి.సత్యనారాయణ రెడ్డి, ప్రస్తుత ఇన్స్పెక్టర్ ఉస్మాన్ షరీఫ్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ.శంకర్,జె. శరత్ కుమార్ రెడ్డి, ఎస్సై శ్రీనివాస్, కోర్టు కానిస్టేబుల్ జి.రవి కిషోర్, సాంబశివ రావు, కోర్టు లైజనింగ్ కె.శ్రీకాంత్ (ఎస్ ఐ) హెూంగార్డ్ ఆఫీసర్ ఎండీ.ఆయూబ్ పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

# విద్యార్థి ఉద్యమాలకు దిక్సూచి ఏఐఎస్ఎఫ్

- ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్
- ఘనంగా ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**పాల్వంచ ఆగష్టు 12 నవభూమి ప్రతినిధి:** విద్యార్థి ఉద్యమాల దిక్సూచి ఏఐఎస్ఎఫ్ అని ఆ సంఘం జిల్లా మాజీ కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్ అన్నారు. మంగళవారం మండల పరిధి లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అరుణ పతాకాన్ని రాహుల్ ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఆవిర్భావ సభల్లో ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పరాయి పాలకుల చెర నుండి భరతమాత విముక్తి కోసం విద్యార్థులను అందరిని ఒక్క తాటిపైకి తీసుకురావటానికి లక్నో నగరాన బెనారస్ విశ్వవిద్యాలయంలో 1936 ఆగస్టు 12న అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆవిర్భవించిందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం అనంతరం విద్యారంగ సమస్యల పరిష్కారమే ఏకైక లక్ష్యంగా ఆనాటి నుండి నేటి వరకు సమరశీల ఉద్యమాలు కొనసాగిస్తున్న ఈ దేశ ప్రథమ విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై, కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో విద్య ఉపాధి హక్కుల సాధనకై సమరశీల పోరాటాల కు సిద్ధం కావాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం వలన పేద, మధ్య తరగతి విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడుతుందని కేవలం డబ్బున్న వాడే విద్యను అభ్యసించే రోజులు రాబోతున్నాయని, ఇటువంటి విద్యా వ్యతిరేక నూతన విద్యా విధానాన్ని తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా దళిత గిరిజన మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ దేశంలో పుట్టిన ప్రతి బిడ్డకు సమానమైన విద్యను అందించాలని డిగ్రీలు పూర్తి చేసిన ప్రతి విద్యార్థికి భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ ఆక్ట్ అమలు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంఈఓ, ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పెండింగ్ స్కాలర్షిప్, రియంబర్స్మెంట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుండాల సృజన, ఏఐఎస్ఎఫ్ నాయకులు రాజ్ కమల్, శ్రీనివాస్, వినయ్, పవన్, అనిల్, రాకేష్, హరీష్, సతీష్, ప్రియాంక, రమ్య, రోజా, నిరోష, కవిత తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యల పరిష్కారానికి

# సమరశీల పోరాటాలు కొనసాగిద్దాం

- ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి ఫహీమ్ దాదా




**కొత్తగూడెం ఆగస్టు 12 నవభూమి ప్రతినిధి:** ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం లో ఏఐఎస్ఎఫ్ 90 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించాడం జరిగింది. ముఖ్య అతిథిగా ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి ఎస్ కే, ఫహీమ్ దాదా హాజరయి శ్వేతా అరుణ పతాకాన్ని ఎగురవేయడం జరిగింది. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకపూర్వమే దేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘంగా ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో మహానగరంలో భగత్ సింగ్, రాజ్ గుర్, సుఖ్ దేవ్, ఆజాద్ ల ఇంకా ఎందరో వీరుల ఆశయ సాధన కోసం బబ్రుద్దీన్ బాసు, ప్రేమ్ నారాయణ భార్గవ్ ల నాయకత్వాన 1936 ఆగస్టు12 న అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆవిర్భవించింది. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల బానిసచేర నుంచి మాతృభూమి విముక్తి కై సాగిన వీరోచిత స్వాతంత్ర్య ఉద్యమంలో పొత్తిళ్లలోనే పిడికిళ్లు బిగించి స్వాతంత్ర్యము మా జన్మ హక్కు అని మా అంతం చూసిన - స్వాతంత్ర్యోద్యమ పంతం వీడం అంటూ నినదించి భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని, భరతమాత బానిస సంకెళ్ల నుంచి విముక్తి కావాలని ఎందరో విద్యార్థుల వప్లవ కిషోరుల బలిదానం చేసిన ఘనమైన చరిత్ర కలిగిన దేశములోనే ఏకైక విద్యార్థి సంఘం ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్ సంజయ్ నవిత సోబిత ప్రణయ్ వంశీ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నరు

# అప్రమత్తంగా ఉండాలి

## సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్

- దమ్మపేట నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి తుమ్మల
- రాష్ట్ర వ్యాప్తంగాభారీ వర్షాల నేపథ్యంలో ముందస్తు చర్యలపై చర్చ






**కొత్తగూడెం / హైదరాబాద్ ఆగస్టు 12 నవభూమి ప్రతినిధి:** రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందస్తుగా తీసుకోవల్సిన చర్యలపై అన్ని జిల్లాలల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో కమాండ్ కంట్రోల్ సెంటర్లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. రానున్న మూడు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్న అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండేలా ముందస్తుగా తెలియజేయాలని వ్యవసాయశాఖ మంత్రికి సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు, పంటలకు వచ్చిన ముప్పేమి లేదని, ఒకవేళ భారీగా వర్షాలు పడితే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా మంత్రి తుమ్మల సీఎంకు తెలిపారు. దూర ప్రయాణాలు మానుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా యూరియాపై ముఖ్యమంత్రి అడగగా.. సోమవారం నుంచి మాత్రమే మనకి రామగుండం నుండి యూరియా సరఫరా మొదలైందని, రోజుకు ఒక రెక్ యూరియా సప్లై చేస్తున్నారని, దానిని డిమాండ్ ఉన్న జిల్లాలకు పంపిస్తున్నామన్నారు. ఇప్పటికే తాను నాలుగు సార్లు, స్వయంగా ముఖ్యమంత్రి నాలుగు సార్లు కేంద్ర ఎరువులు, రసాయనలు శాఖ మంత్రి నడ్డా ను కోరినా, కేంద్రం నుండి ఎలాంటి రెస్పాన్స్ లేదని, 4 నెలల నుండి వారు కేటాయించిన విధంగా ఎప్పుడూ పూర్తిగా సరఫరా చేయలేదని, మన దగ్గర ఉన్న బఫర్ స్టాక్‌తోనే ఇప్పటివరకు సర్దుబాటు చేయడం జరిగిందని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నెలలో యూరియా వాడకం ఎక్కువగా ఉంటుందని, వరి నాట్లు కూడా 15 వరకు అయిపోతాయని, యూరియా ధరలు తక్కువగా ఉండటం వలన కూడా ఎక్కువగా అమ్మకాలు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే యూరియా కొరత ఉందని, కేంద్రం నుండి అవసరం మేరకు యూరియా రాకుంటే ఇబ్బందులు తలెత్తుతాయని అన్నారు. ఢిల్లీలోని మన రాష్ట్ర ఎంపీలను కేంద్ర మంత్రి జెపి నడ్డాను కలిసి మరోసారి రాష్ట్రానికి రావాల్సిన యూరియా గురించి అడిగేవిధంగా సూచించాలని ముఖ్యమంత్రిని ఈ సందర్భంగా మంత్రి తుమ్మల కోరారు. ఈసందర్భంగా సీఎం పలు సూచనలు చేశారు. రాబోయె 72 గంటలు అందరూ అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని,ఎక్కడ ఏం జరిగినా సమాచారం కంట్రోల్ రూం కు చేరేలా చూడాలన్నారు.

ముంపు ప్రాంతాల్లో ప్రజలను సురక్షితప్రాంతాలకు తరలించాలి, ఎక్కడా ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగడానికి వీల్లేదన్నారు. సహాయక చర్యలకు అవసరమైన నిధులు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, విద్యుత్ శాఖ అధికారులు ఎక్కడికక్కడ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మొబైల్ ట్రాన్స్ఫార్మర్ లు, జనరేటర్లు సిద్ధంగా ఉంచుకోవాలి, డ్రైనేజ్ వ్యవస్థను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి అత్యధిక వర్షాలు పడే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలి,

గతంలో ఖమ్మంలో 2 గంటల్లో 42 సెం.మీ వర్షం పడిందని సీఎం గుర్తు చేశారు. ఉద్యోగులు, సిబ్బంది సెలవులు రద్దు చేసి 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు హైదరాబాద్ లో ప్రమాద స్థాయికి నీరు చేరిన చోట ప్రజలు వెళ్లకుండా పోలీసు సిబ్బంది అలెర్ట్ చేయాలీ, వర్షాల నేపథ్యంలో మూడు కమిషనరేట్ లలో ట్రాఫిక్ నియంత్రణకు లా అండ్ ఆర్డర్ పోలీసుల సహకారం తీసుకోవాలని వర్షాలు, వరదల పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఎఫ్‌ఎం రేడియోలలో అలర్ట్ చేయాలన్నారు. క్లౌడ్ బరస్ట్ సమయాల్లో పరిస్థితులను ఎదుర్కొనేలా సన్నద్ధం కావాలి,పరిస్థితులనుబట్టి స్కూళ్లు, కాలేజీలకు సెలవులు ప్రకటించాలి, ఐటీ ఉద్యోగులు వర్క్ ఫ్రం హొమ్ చేసేలా చర్యలు తీసుకోవాలి, సాధ్యమైనంత వరకు రోడ్లపై ట్రాఫిక్ తక్కువగా ఉండేలా చూడాలి, అత్యవసర టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని కోరారు. సమాచార శాఖ మీడియాకు సరైన సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే 72 గంటలు అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండి సమన్వయంతో పనిచేయాలని సీఎం ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు అధికారులు కార్య స్థానంలో అందుబాటులో ఉండాలి: జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన మరియు వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి అని, అవసరమైన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించండి అని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు అని సూచించారు. అధికారులు సెలవులు రద్దు చేసుకొని కారేస్థానంలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వరదలు సంభవించే ప్రాంతాలను గుర్తించి, అక్కడ నివసిస్తున్న ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భారీ వరద ప్రవాహ సమయంలో నదులు, కాలువలు, చెరువులు వంటి జలవనరుల వద్దకి వెళ్లకూడదని, వాటిని దాటేందుకు ప్రయత్నించరాదని స్పష్టం చేశారు. అలాగే రహదారులు, కల్వర్టులపై నీరు ప్రవహిస్తున్న చోట్ల అధిక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీరు కలుషితమయ్యే అవకాశాన్ని నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం కాపాడుతూ, వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన సూచనలు అందించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధంగా ఉండాలని తెలిపారు. తాగునీటి సరఫరాలో అంతరాయం రాకుండా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరా నిలిచిన సందర్భంలో ఆసుపత్రుల్లో అత్యవసర సేవలకు ఆటంకం కలగకుండా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రసవం సమీపించిన గర్భిణీలను ముందుగానే ఆసుపత్రులు లేదా గర్భిణీల వసతి కేంద్రాలకు తరలించాలని సూచించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో నాగలక్ష్మి, సిపిఓ సంజీవరావు, పంచాయతీ అధికారి చంద్రమౌళి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా వైద్య శాఖ అధికారి జయలక్ష్మి, మరియు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వాగ్దానాలను నెరవేరుస్తాం

- అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అందిస్తున్నాం
- రాబోవు ఎన్నికల్లో ప్రజా పాలన ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలి
- ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



**కామేపల్లి,నవభూమి,ఆగష్టు 12 :** ప్రజా పాలన ప్రభుత్వాన్ని రానున్న స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు ప్రజలు ఎల్లప్పుడూ ఆశీర్వదించాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బి.రాంబాబు,డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాలోత్ బావ్ సింగ్ పిలుపుని చ్చారు.కామేపల్లి మండలం ముచ్చర్ల లక్ష్మి ఫంక్షన్ హాల్ మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కూడా లబ్ధిదా రులకు పంపిణీ చేశారు.అనంతరం తాసిల్దార్ సిహెచ్ సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన సభ లో ప్రసంగించారు.ఇందిరమ్మ ప్రభుత్వంలో గ్రా మ సీమల అభివృద్ధికి నిరంతర కృషి చేస్తున్నా మని అన్నారు.రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వకపోగా ప్రజల ను మోసం చేసిందని రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దోపిడీ చేసిందని ఆరోపించారు.రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ప్రజా సంక్షేమాన్ని దృష్టి లో పెట్టుకొని ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హా మీని నెరవేరుస్తున్నామని తెలిపారు.ఇందిరమ్మ రాజ్యంలో ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డుల పంపి ణీ పండగలా జరుగుతుందని వెల్లడించారు. నిత్యం ప్రజల సమస్యలు,వారి అవసరాలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు.పల్లె ప్రాంతాల్లో అభివృద్ధిని పరుగులు పెట్టించాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని వివరించారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సిహెచ్ సుధాకర్, ఎంపీడీవో జి.రవీందర్, ఎం పి ఓ పి. ప్రభాకర్ రెడ్డి,ఎస్సై బి.సాయికుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి,కొండా యిగూడెం సొసైటి చెర్మన్ డి.హనుమంతరావు, మండల పార్టీ ఉపాధ్యక్షులు రెడబోతు గోపిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దమ్మాలపాటి సత్యనారాయ ణ,జిల్లా నాయకులు మద్దినేని రమేష్ బాబు, తోటకూరి శివయ్య,మండల కాంగ్రెస్ నాయకు లు బానోత్ నరసింహ నాయక్,దేవండ్ల రామకృ ష్ణ, దొడ్ల వేణు,అనురాధ, చల్ల మల్లయ్య, వల్లభనేని అశోక్,మాజీ ఎంపీపీలు మాలోత్ సరి రామ్ నాయక్,జర్పుల లక్ష్మణ్ నాయక్,గాదె రాంబాబు, రవి,వరి కొల్లు సైదులు,యల్లమద్ది నరసింహారావు,రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షులు కుమార్,అజ్మీర మంగీలాల్,అజ్మీర రవీందర్ తదితరులు పాల్గొన్నారు.కాగా ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అర్హులైన వారందరికీ అందజేసి ఆదుకోవాలని సమావేశం అనంతరం ముచ్చర్ల గ్రామానికి చెందిన చిల్లా కోటేశ్వరరావు,చిల్లా సురేష్, దేవుండ్ల సీతారా ములు తదితరులు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు విన్నవించారు.ఇల్లులు మంజూరు కాక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై దృష్టి సారించి ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని వారు మొరపెట్టుకున్నారు.దీంతో ఎమ్మెల్యే స్పందించి ఇళ్లను మంజూరు చేసి ఆదుకోవడం జరుగుతుందని స్పష్టం చేయడం జరిగింది

# ఎన్టీఆర్‌కి ఎవరూ సాటిరారు: మంత్రి తుమ్మల

- ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి తుమ్మల
- ముఖ్య అతిథి నందమూరి రామకృష్ణ





**కొత్తగూడెం ఆగస్టు 12 (ఎం.ఏ. వహబ్ ) నవభూమి ప్రతినిధి:** దమ్మపేట మండలం నాచారం గ్రామంలో మంగళవారం స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నందమూరి రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, హాజరయ్యారు.

**ఎన్టీఆర్ బాటలోనే నడుస్తున్నాం: మంత్రి తుమ్మల**

నందమూరి తారక రామారావు వలననే తెలుగు జాతికి గౌరవం వచ్చిందనీ, ఎక్కడ ఉన్నామన్నది కాదు, ఏం చేశామన్నదే ముఖ్యమని ఆనాటి ప్రభుత్వంలో పేదల కోసం, బడుగు బలహీన వర్గాల కోసం ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్న ఎన్టీఆర్ స్ఫూర్తితోనే తాము పని చేస్తున్నాం అని అన్నారు. నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ తెలుగు వారి ఔన్నత్యాన్ని కీర్తిని లోకానికి చాటిచెప్పిన ఘనత యుగపురుషుడు ఎన్టీఆర్ కి దక్కుతుందన్నారు. పేదల సంక్షేమానికి అభివృద్ధికి ఆయనకి మరొకరు సాటి లేరని నాచారంలో విగ్రహావిష్కరణకు ఆయన కుమారుడిగా గౌరవం దక్కటం గర్వించదగ్గ విషయమన్నారు. ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం కృషి చేస్తామని ఆయన స్ఫూర్తితోనే అనేకమంది రాజకీయాల్లోకి వచ్చి నేడు అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ను చంద్రబాబు నాయుడు అప్డేట్ చేశారని అదేవిధంగా అభివృద్ధి తుమ్మల వ్యవసాయ శాఖ మంత్రిగా రైతులకు ఎంతో మేలు చేస్తున్నారని, అభివృద్ధిలో ఆయనతో ఎవరు పోటీ పడలేరన్నారు. ఎన్టీఆర్ ఖ్యాతి చిరస్థాయిగా నిలుస్తుంన్నారు. వాసిరెడ్డి రామనాథం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో పేదల సంక్షేమానికి ఎంత కృషి చేశారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో రాజకీయాలలో అడుగుపెట్టిన తుమ్మల నాగేశ్వరరావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వామిగాటమే కాకుండా ఖమ్మం జిల్లాను అభివృద్ధిలో అగ్రభాగాలు నిలిపిన ఘనత తుమ్మలకే దక్కుతుందన్నారు. ఈ విగ్రహావిష్కరణ పాల్గొనటం ఈ గ్రామానికి తన రుణపడి ఉన్నానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, నన్నూరి నర్సిరెడ్డి, ఆయిల్ ఫామ్ రైతు అధ్యక్షులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, మాజీ జెడ్పిటిసి పైడి వెంకటేశ్వరరావు, జిల్లా పార్టీ నాయకులు కనగాల సాంబశివరావు, మాజీ ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్, వనమా వాసు, కట్రం స్వామి దొర సొసైటీ, చైర్మన్ వెల్లిన రాఘవరావు సొసైటీ వైస్ చైర్మన్ కట్టం ఎర్రప్ప, అధ్యక్షులు వలీపాషా, తేర్ల చెన్నయ్య, వారాది సత్యనారాయణ, పానుగంటి రామారావు తదితరులు పాల్గొన్నారు.



# జమలాపురంలో కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశం...ముఖ్య అతిథిగా మల్లు నందిని



**ఎర్రుపాలెం,నవభూమి,ఆగస్టు 12 :** మండల పరిధిలోని జమలాపురం లోని బాలాజీ భవన్ నందు మంగళవారం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యకార్యకర్తలు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని విక్రమార్క పాల్గొన్నారు. ఈసందర్భంగా నందిని మాట్లాడు తూ త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాలను కైవసం చేసుకోవాలని మండల నాయకు లకు,కార్యకర్తలకుసూచించారు. మండలం లో భట్టి విక్రమార్క చేసిన అభివృద్ధి పను లను గడప గడపకు తీసుకెళ్లాలని,కార్య కర్తలు నాయకులు గ్రామాల్లో పాత,కొత్త విభేదాలు లేకుండా కార్యకర్త లందరూ కష్టపడి పని చేయాలన్నారు. ప్రతి కార్యకర్త కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా ఉండి అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగర వేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్,గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరావు,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు,జిల్లా ఆర్టిఏ డైరెక్టర్ గజ్జెలి వెంకన్న,జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు పుచ్చ%శీ%కాయల వీరభద్రం,జిల్లా మహిళా అధ్యక్షులు దొబ్బల సౌజన్య,జిల్లా యూత్ కాంగ్రెస్అధ్యక్షులు వెజెండ్లసాయి కుమార్, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు బొందయ్య, కిసాన్ సెల్ అధ్యక్షులు మొక్క శేఖర్ గౌడ్, మధిర నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అద్యక్షులు తుమాటి నవీన్ రెడ్డి,మధిర మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చావా రామకృష్ణ,మండల ఉపాధ్యక్షులు శీలం శ్రీనివాస రెడ్డి,బొగ్గుల గోవర్ధన రెడ్డి, మూల్పూరి శ్రీనివాసరావు,పంబిసాంబశివ రావు,కడియంశ్రీనివాసరావు,కంచర్ల వెంకట నరసయ్య,లక్ష్మణరావు,ఇస్మాయి ల్,మండల ముఖ్య నాయకులు,వివిధ అనుబంధ సంఘ నాయకులు మార్కెట్, ఆత్మ కమిటీ డైరెక్టర్లు,యూత్ కాంగ్రెస్ నాయకులు,మహిళా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# మండలంలో ఎంపీడీవో విస్తృత పర్యటన



**టేకులపల్లి ఆగస్టు 12 నవభూమి ప్రతినిధి:** టేకులపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి బైరు మల్లేశ్వరి మండలంలోని గంగారం, లచ్చగూడెం, కిష్టారం, బర్లగూడెం, చింతోనిచలక, ముత్యాలంపాడు క్రాస్ రోడ్ పంచాయతీలను సందర్శించి, పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ముందుగా చింతొనిచలక గ్రామపంచాయతీ పరిధిలోని గుత్తి కోయల ఆవాసమైన సర్వన బోడు గ్రామాన్ని సందర్శించి వారితో నీటి సమస్యలు, ఇతర సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. గంగారంలో నర్సరీ, ఇంకుడు గుంటలు, లచ్చగూడంలో పల్లె ప్రకృతి వనాన్ని, నర్సరీ, చెరువులు, కిష్టారం గ్రామంలో అంగన్వాడి సెంటర్, పిల్లల భోజన వివరాలను, నర్సరీని పరిశీలించడం జరిగింది. బర్లగూడెం, మోట్లగూడెం గ్రామం రాయపాడు బ్రిడ్జిని పరిశీలించి వరద ప్రవాహాన్ని వాకబు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి జక్కుల గణేష్ గాంధీ, ఏపీవో కాళంగి శ్రీనివాస్, కార్యదర్శులు కవిత, అనిల్, సునీల్, సతీష్, జీవన్, టెక్నికల్ అసిస్టెంట్ భీముడు, క్షేత్రసహాయకులు సత్యనారాయణ, సరిత పాల్గొన్నారు

# గిరిజనులు సేకరించే అటవీ ఫలాలను నేరుగా జీసీసీ డిపోలకే అందాలి

- తెలంగాణ రాష్ట్ర జిసిసి చైర్మన్ కోట్నాక తిరుపతి
- మధ్య దళారుల ప్రమేయం లేకుండా తగిన జాగ్రత్తలు వహించాలి





**పాల్వంచ ఆగష్టు 12 నవభూమి ప్రతినిది:** అడవులలో గిరిజనులు సేకరించే అటవీ ఫలాలను మధ్య దళారుల ప్రమేయం లేకుండా నేరుగా జీసీసీ డిఆర్ డిపోలకే అందించే విధంగా జిసిసి సిబ్బంది కృషిచేసి వాటికి మార్కెటింగ్ సౌకర్యం కల్పించి రికార్డులన్నీ సక్రమంగా నిర్వహిస్తే జిసిసి డిఆర్ డిపోలన్నీ లాభాల బాటలో నడుస్తాయని తెలంగాణ రాష్ట్ర జిసిసి చైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. మంగళవారం పట్టణం లోని జిసిసి కార్యాలయంలో ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తో కలిసి జిసిసి మేనేజర్లు, ఉద్యోగులు, జిసిసి హెల్పర్ల పనితీరు పై ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీసీసీ ద్వారా నడపబడుతున్న పెట్రోల్ పంపులు, డిఆర్ డిపోలు సక్రమంగా నడిచేలా సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని, అడవులలో దొరికే ఇప్పపువ్వు, ఇప్పబద్దలు సీజన్ ఉన్నప్పుడే ముమ్మరంగా సేకరించాలని, జిసిసి ఆవరణలో ఖాళీగా ఉన్న ప్రదేశంలో కమర్షియల్ గా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, మార్కెటింగ్ సౌకర్యం విరివిగా ఉన్న పాల్వంచలో ఇటువంటి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం ద్వారా అడవిలో సేకరించే ప్రతి అటవీ ఫలాలు ఇటువంటి కాంప్లెక్స్లో అమ్మకాలు జరుపుకుంటే జిసిసిలు లాభాల బాటలో నడుస్తాయని, ఉద్యోగులకు కూడా వేతనాల పరంగా ఇబ్బందులు ఉండవని అన్నారు. ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ మాట్లాడుతూ జీసిసి పరిధిలో నడుస్తున్న డి ఆర్ డిపోలు చాలావరకు మరమ్మత్తులు చేయవలసి ఉన్నాయని, పాల్వంచ లో పెట్రోల్ పంపు నిర్మాణం కొరకు ప్రతిపాదనలు పంపించడం జరిగిందని కానీ ఎన్ఓసి ప్రతిపాదనలు రాకపోవడం వలన నిర్మాణం ఆగిపోయిందని, ఇప్పపువ్వు, ఇప్పబద్దల ద్వారా రా మెటీరియల్ ఇప్ప నూనె తయారు చేయడానికి ఎవరైనా గిరిజనులు ముందుకు వస్తే ఐటీడీఏ ద్వారా నూనె తీసే యంత్రాలు అందించడానికి సహకరిస్తామని, డి ఆర్ డిపోలు, పెట్రోల్ పంపు నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలు అందించాలని అన్నారు. అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనకు వచ్చిన జీసీసీ చైర్మన్ కు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఎం జిసిసి సమ్మయ్య, మేనేజర్ జయరాజ్, రాము, నరసింహారావు, కార్యాలయం ఉద్యోగులు, ఫీల్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఇసుక లారీ పట్టివేత: ఒకరి అరెస్టు



**అన్నపురెడ్డిపల్లి ఆగస్టు 12 నవభూమి:** మండలం లోని గుంపెన బ్రిడ్జి వద్ద స్వర్గం పాపారావు లారీ డ్రైవర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రి వద్ద గోదావరి నది వద్దకు పోయి అక్రమంగా 25 టన్నుల ఇసుకను టీ ఎస్ 04 యు డి 8379 నెంబరు గల లారీ లో నింపుకుని ఎటువంటి ప్రభుత్వ అనుమతి పత్రాలు లేకుండా తెలంగాణ రాష్ట్రంలో అధిక ధరలకు అమ్ముకుందామని సత్తుపల్లి, వి ఏం బంజర మీదుగా చంద్రుగొండ వైపు వెళుతుండగా అన్నపురెడ్డిపల్లి పోలీస్ సిబ్బంది ఉదయం 08:00 గంటల సమయంలో గుంపెన గ్రామం బ్రిడ్జి వద్ద అట్టి ఇసుక లారీని పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించి లారీ డ్రైవర్ స్వర్గం పాపారావు,ని అదుపు లోకి తీసుకొని విచారణ చేసి లారీ యజమాని సాలె రాణి, డ్రైవర్ మరియు యజమాని మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరాలు వెల్లడించిన అన్నపురెడ్డిపల్లి ఎస్ఐ సి హెచ్ చంద్రశేఖర్.

# హెవీ వాటర్ ప్లాంట్, సింగరేణి, బీటీపీఎస్ సెక్యూరిటీ ఇంచార్జ్‌లతో మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి సమావేశం





**మణుగూరు ఆగస్టు 12 నవభూమి ప్రతినిధి:** మణుగూరు డిఎస్పి కార్యాలయంలో హెవీ వాటర్ ప్లాంట్ సింగరేణి మరియు బిటిపిఎస్ లకు చెందిన సెక్యూరిటీ ఇంచార్క్ లు మరియు సిబ్బంది తో డీఎస్పీ రవీందర్ రెడ్డి సమావేశం నిర్వహించారు, ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి, హెవీ వాటర్ ప్లాంట్ కాలనీలలో అధికారులు, కార్మికులు నివాసముండే ప్రాంతాల్లో చోరీలతో పాటు నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు, అంతే కాకుండా నిరంతరం సిబ్బందితో పర్యవేక్షించాలని, కాలనీలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని తెలిపారు, ఇటీవల హెవీ వాటర్ ప్లాంట్ కాలనీలో చోరీ విఫలయత్నానికి సంబంధించిన ఘటన గురించి చర్చించారు, తాళాలు వేసిన ఇళ్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, రాత్రి సమయంలో విధులు నిర్వహించే సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండే విధంగా సంబంధిత అధికారులు చూడాలని డిఎస్పి సూచించారు, సింగరేణి, బీటీపీఎస్, హెవీ వాటర్ ప్లాంట్ పరిధిలో మరియు కాలనీలలో అత్యాధునిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు, ఈ సమావేశంలో మణుగూరు, అశ్వపురం ఎస్హెచ్ఓ లు పి నాగబాబు, అశోక్ రెడ్డిలతో పాటు సింగరేణి సెక్యూరిటీ అధికారి శ్రీనివాస్ మరియు హెవీ వాటర్ ప్లాంట్, బీటీపీఎస్ సెక్యూరిటీ ఇంచార్జ్ లు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి రాఖీ కట్టిన మచ్చ బొల్లారం డివిజన్ మహిళా రిసోర్స్ పర్సన్స్

**అల్వాల్, నవభూమి ప్రతినిధి, ఆగస్టు 12:** మచ్చ బొల్లారం డివిజన్ కి చెందిన రిసోర్స్ పర్సన్ ఆర్పిలు రాఖీ పండుగ ను పురస్కరించుకొని మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కి రాఖీలు కట్టిన రిసోర్స్ పర్సన్ ఆర్.పి , మహిళలు పాల్గొన్నారు. బోయిన్పల్లి లోని మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ని కలిసి రాఖీ పౌర్ణమి సందర్భంగా రాఖీలు కట్టారు

# యాదవ రెజింగ్ లా రాజ్ కలశ యాత్రను జయప్రదం చేయండి

## ■ మేకల మల్లిబాబు యాదవ్

**కామేపల్లి, నవభూమి, ఆగస్టు 12 :** అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా చేపట్టిన యాదవ రెజింగ్ లా కలశ యాత్ర ఈనెల 13న ఖమ్మం జిల్లాలోకి చేరు కుంటుందని,14న ఎన్టీఆర్ సర్కిల్ ఖమ్మం నుండి యాత్ర బయలుదేరుతుందని పెద్ద ఎత్తున యాదవులు ఈ కార్యక్ర మంలో పాల్గొని జయప్రదం చేయాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్ పిలుపునిచ్చారు. కామేపల్లి మండలం పండితా పురం గ్రామంలో మంగళవారం జరిగిన మండల యాదవ నాయకుల సమావేశంలో మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ యాదవ రెజింగ్ లా కలశ యాత్ర 13న సూర్యాపేట నుం డి ఖమ్మం జిల్లాలోకి ప్రవేశిస్తుందని,నాయకన్ గూడెం,కూసు మంచి, తల్లంపాడు మీదుగా ఖమ్మం చేరుకుని, ఖమ్మంలో భారీ ర్యాలీ కార్యక్రమం చేపట్టి, 14న ఎన్టీఆర్ సర్కిల్ నుండి రఘునాధపాలెం మండలం బల్లేపల్లి, మంచుకొండ, బూడిదంపాడు, కామేపల్లి మండలం పండితాపురం, ముచ్చర్ల క్రాస్ రోడ్డు, కొత్త లింగాల ,గోవింద్రాల,పొన్నెకల్లు మీదుగా మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ కు చేరుకుంటుం దని రూట్ మ్యాప్ ను వివరిం చారు. ఈ యాత్ర కార్యక్రమం లో మండలాల నుండి పెద్ద ఎత్తున యాదవులు కోలాట నృత్యాలతో, మన సంస్కృతి సాంప్రదాయాన్ని చాటుకుం టూ యాత్రలో పాల్గొనాలని మల్లి బాబు యాదవ్ కోరారు. దేశాన్ని పరిపాలిస్తున్న ప్రభుత్వాలు బీసీలలో అధిక జనాభా కలిగిన యాదవుల ను,యాదవుల త్యాగాలను, బలిదానాలను విస్మరిస్తున్నాయని, దానిలో భాగంగా 1962 – 65 వరకు జరిగిన భారత్ చైనా యుద్ధంలో అహీర్ రెజిమెంట్ ( యాదవ రెజిమెంట్ ) తరపున యాదవులు పాల్గొని చైనా



వారిని దీటుగా ఎదుర్కొని, భారత భూభాగాన్ని ఆక్రమించకుండా అడ్డుకోవడం జరిగిందని, ఈ యుద్ధంలో 114 మంది యాదవులు ప్రాణత్యాగం చేశారని, ఆ త్యాగాలకు గుర్తింపు లేకుండా, అంతేకాకుండా ఆ రెజిమెంట్ ను రద్దు చేయడం జరిగిందని, దీనికి నిరసనగా కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఏప్రిల్ 13న బీహార్ లోని పాట్నా నుండి భారీ ఎత్తున అన్ని రాష్ట్రాల గుండా లక్ష కిలోమీటర్లు యాత్ర కార్యక్రమం నిర్వహించబడిందని, దీనివలన అన్ని రాష్ట్రాలలోని యాదవులు చైతన్యం కూడా జరుగుతుందని, రాజకీయాలు వర్గాలకతీతంగా యాదవులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కామేపల్లి మండల యాదవ సంఘం నాయకులు జక్కుల బ్రహ్మయ్య, మంద నాగేశ్వరరావు, మేకల అశోక్, ఎర్రగడ్డ చంద్రయ్య,చింతల వెంకయ్య, అరి పిన్ని అశో క్,మేకల మహేష్ బాబు,అరవ లాల్ కృష్ణ,అల్లిక బక్కయ్య, కేతబోయిన రాంబాబు,సత్తి వీరబాబు, చింతల చిన్న వెంకయ్య,అర్వ సత్యం,అర్వ బాబు,అర్వ సోమయ్య, కేతబోయిన వెంకటేశ్వర్లు, పొన్నేకల్ వెంకన్న, అర్వ నాగరాజు,కంపసాటి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుందాం

## ■ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు నాగరాజు దేవర, మారగాని వెంకట్

**ఖమ్మం రూరల్, నవభూమి, ఆగస్టు 12:** ఈనెల 19న ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకోవాలని తెలంగాణ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా గౌరవ అధ్యక్షులు నాగరాజు దేవర, జిల్లా అధ్యక్షులు మారగాని వెంకట్ కోరారు. మంగళవారం మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో గల శ్రీనివాస రెడ్డి ఫంక్షన్ హాల్ లో మల్లెల వీరన్న అధ్యక్షతన ఖమ్మం రూరల్ మండలం ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాగరాజు దేవర, మారగాని వెంకట్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. జిల్లా, రాష్ట్ర అసోసియేషన్ లు ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ల సంక్షేమం కోసం ఎంతో పాటు పడుతున్నాయన్నారు. ప్రతి ఫోటో, వీడియో గ్రాఫర్ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకొని రాణించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ కుటుంబ భరోసా పథకంలో సభ్యులుగా చే చేరాలని కోరారు. అనంతరం ఎన్నికైన ఖమ్మం రూరల్ మండలం కమిటీచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఖమ్మం రూరల్ మండలం అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా పెరుమాళ్ళపల్లి రమేష్ బాబు, కొండపర్తి రఘురాం ప్రసాద్, గౌరవ సలహాదారులుగా ఆరెంపుల రామమూర్తి, బోయిన సంగయ్య, అధ్యక్షులుగా మల్లెల వీరన్న, ప్రధాన కార్యదర్శిగా తొర్రికొండ రవి, కోశాధికారిగా ఎస్కే గౌస్ మియా, ఉపాధ్యక్షులు యు శ్రీనివాసరెడ్డి, జాయింట్ సెక్రెటరీగా డి లక్ష్మణ్, ఏ రాజా, మీడియా కోఆర్డినేటర్ గా బచ్చులకూరి వెంకటేష్, కార్యవర్గ



సభ్యులుగా నునావత్ రవి, బి సాయి, బి సురేష్, సిహెచ్ మధు, వంశీ, గోపి, నరేష్, రూరల్ సభ్యులు వేణు గోపి మహేష్ ఎన్నికయ్యారు. మండల అసోసియేషన్ అధ్యక్షులుగా మూడోసారి ఎన్నికైన మల్లెల వీరన్న మాట్లాడుతూ మండలంలో అసోసియేషన్ అభివృద్ధికి తన వంతు కృషి చేసినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా సభ్యులందరినీ కలుపుకొని అసోసియేషన్ అభ్యున్నతి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేయడంతో పాటు సీనియర్ సభ్యులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నీరుడు తిరుపతిరావు, ఖమ్మం టౌన్ అధ్యక్షులు రఘు, ప్రధాన కార్యదర్శి కేస్ బాబా, జిల్లా మాజీ గౌరవ సలహాదారులు ఉస్మాన్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆరెంపుల మస్తాన్, లాస్య అంజి, శివ, రూరల్ మండలం సభ్యులు సాయి వకీల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.









# మీనవోలులో మహిళ కూలీలతో కలిసి నాటు వేసిన మల్లు నందిని



**ఏర్రుపాలెం, నవభూమి, ఆగస్టు12 :** మండల పరిధిలోని మీనవోలు గ్రామంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని విక్రమార్క మంగళవారం కూలీల తో కలిసి వరినాటు వేశారు. మధిర నుండి జమలాపురంలో జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల కార్యకర్తల సమావేశానికి వెళుతూ మీనవోలు గ్రామం లో కూలీలు నాటు వేస్తున్న దృశ్యాన్ని చూసి ఆగి ఆమె అక్కడికి వెళ్లి వారితో కలిసినాటువేసి కొద్దిసేపుముచ్చటించారు. నాటు వేసినందుకు రోజువారి కూలి ఎంత వస్తుంది. ఒక ఎకరం ఎంతమంది కూలీలు నాటతారు అని వివరాలుఅడిగి తెలుసు కున్నారు.కూలీలు నందినితో ఫోటోలు దిగేందుకు ఉత్సాహం చూపారు

# బీసీ రిజర్వేషన్ల బిల్లు పార్లమెంట్లో ఆమోదించాలి: సిపిఎం డిమాండ్




**ఎర్రుపాలెం,నవభూమి, ఆగస్టు12 :** తెలంగాణ రాష్ట్రంలో స్థానికసంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుపరిచేందుకు బిజెపి ప్రభుత్వం బిల్లును పార్లమెంటులో ఆమోదించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య,సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్ రావు కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎర్రుపాలెం రైల్వే స్టేషన్ రోడ్డులో గల అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం ధర్నానిర్వహించారు.వృత్తి సంఘం జిల్లా నాయకులు గౌరాజు రాము లు అధ్యక్షతనజరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల అమలకు, సామాజిక న్యాయానికి,కుల గణనకు బిజెపివ్యతిరేకమని విమర్శించారు. బీహార్ లో జరగనున్న ఎన్నికల దృష్ట్యా తమ వ్యతిరేకతను కప్పిపుచ్చుకుంటూ ముస్లిం లను షాకుగా చూపిస్తుందని అన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లులో హిందువులు కూడా ఉన్నారని వారికి బిజెపి వ్యతిరేకమా అని ప్రశ్నించారు.బిజెపి ద్వంద వైఖరిని అవలంబిస్తుందని విమర్శించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి బహిరంగ సభలో రాహుల్ గాంధీ బిసి డిక్లరేషన్ లో వివిధ వృత్తిదారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానికసంస్థలఎన్నికలలో 42% రిజర్వేషన్ల అమలు కోసం రాష్ట్ర అసెంబ్లీలో ఆమో దించిన బిల్లును కేంద్ర ప్రభుత్వం ఎందుకు వ్యతిరేకిస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. బిసి రిజర్వేషన్లపై చిత్తశుద్ధి ఉంటే గవర్నరే నిర్ణయం తీసుకోవచ్చని అన్నారు.బీసీ రిజర్వేషన్లను అమలుపరిచేందుకు పార్లమెంటులో చట్టం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గొల్లపూడి కోటేశ్వరరావు, నల్లమోతు హనుమంతరావు,దూదిగం బసవయ్య,ఆంగోత్ వెంకటేశ్వర్లు,సగుర్తి సంజీవరావు,నాగులవంచ వెంకటరామ య్య,షేక్ నాగుల మీర,కూడల్లి నాగేశ్వర రావు,దివ్యల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# అనిశెట్టి రజిత మృతి,వద్దిరాజు సంతాపం

**హైదరాబాద్ నవభూమి ప్రతినిధి ఆగస్టు 12 :** ప్రముఖ స్త్రీవాద రచయిత్రి, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన అనిశెట్టి రజిత మృతి పట్ల బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్ర సంతాపం తెలిపారు.

# మాదక ద్రవ్యాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

## ■ కలెక్టర్ జితేష్ వి. పాటిల్




**కొత్తగూడెం ఆగస్టు 12 నవభూమి ప్రతినిధి:** జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని, మాదకద్రవ్యాలు, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు.మంగళవారం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశ మందిరము లో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ కమిటీ సమావేశాన్ని నిర్వహించా రు. జిల్లాలో నమోదవుతున్న ఎన్‌డీపీఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాధక ద్రవ్యాల వాడకం, నియంత్రణ చర్యలు, శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ విని యోగం వల్ల కలిగే నష్టాల గురించి చేయాల్సిన విస్తృత ప్రచారం వంటి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్, మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని అమలుచేయాలని సూ చించారు. జిల్లాలో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, మోడల్ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకుల పాఠశాలల్లో డ్రగ్స్, మాదకద్రవ్యాల వల్ల కలి గే నష్టాలపై వైద్య అధికారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సెలింగ్ అందించేలా చర్యలు తీసుకోవాలనీ సూచించారు. డీ అడిక్షన్ సెంటర్ ద్వారా అవసర మైన వారికి చికిత్స అందించాలన్నారు. అటవీశాఖ అధికారులు వారి పరిధిలోని అటవీభూములు పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. జిల్లాలోని ఆసుపత్రులు, మెడికల్ షాపులలో స్టాక్ వివరాలను ప్రతి నెల తనిఖీ చేయాలని కలెక్టర్ డ్రగ్ ఇన్స్పెక్టర్‌కు సూచించారు. ఇంటర్ కళాశాలలో మాదక ద్రవ్యలు వినియోగం వల్ల జరిగే నష్టాలు పట్ల అవగాహన కల్పించడానికి ఈ వారం లో ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో విద్యార్థులకు, యువతకు, ప్రజల కు, విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, యువత గంజాయి డ్రగ్స్‌వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేసి ర్యాగింగ్ మొదటిదశలోనే కట్టడి చేయాలని, కళాశాలల యాజమాన్యాలు, విద్యా ర్థుల అలవాట్లను, నడవడికను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ఈ సమావేశం లో జడ్ పి సిఈఓ నాగలక్ష్మి, ఇంటర్మీడిట్ అధికారి వేంకటేశ్వరరావు, జిల్లా వైద్య శాఖ అధికారి జయలక్ష్మి, రవాణా శాఖ అధికారి వెంకటరమణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

# శిశు మరణాలను అరికట్టడం అందరి బాధ్యత

## ■ కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**కొత్తగూడెం ఆగస్టు 12 నవభూమి ప్రతినిధి:** జిల్లా పరిధిలో శిశు మరణాలను పూర్తిగా నివారించేందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది, ఆశా కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో ట్రైనీ కలెక్టర్ సౌరభ్ శర్మతో కలిసి శిశు మరణాల పర్యవేక్షణ,ప్రతిస్పందన కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ సంవత్సరం జిల్లాలో నమోదైన 7 శిశు మరణాలపై వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, జిల్లా వైద్య అధికారులు,వైద్య నిపుణులు, ఫీల్డ్ సిబ్బంది సమగ్ర సమీక్ష నిర్వహించారు. మరణాలకు గల కారణాలను విశ్లేషించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి కఠినంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ప్రాణం అమూల్యమని, సమయానికి తీసుకునే జాగ్రత్తలు శిశువుల ప్రాణాలను కాపాడగలవని ఆయన అన్నారు. మహిళలు గర్భం దాల్చిన నాటి నుండి ప్రసవం వరకు అవసరమైన అన్ని వైద్య పరీక్షలు సమయానికి చేయించుకునేలా గ్రామస్థాయిలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తరచుగా గర్భిణీల ఇళ్లను సందర్శించాలి. రక్తహీనత నివారణకు పౌష్టికాహారం, అవసరమైన మందులు అందేలా చూడాలి. అంగన్వాడి సిబ్బంది పౌష్టికాహారంపై మార్గదర్శకాలు ఇవ్వడంతో పాటు గర్భిణీల రిజిస్ట్రేషన్, ఆరోగ్య వివరాలను సక్రమంగా నమోదు చేయాలి. హై రిస్క్ గర్భిణీలకు ప్రత్యేక పర్యవేక్షణ, సమయానికి వైద్య సేవలు అందించాలి.గిరిజన, గుత్తికోయల ప్రాంతాల్లో పిల్లల ఆరోగ్యం, తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా నిమోనియా పై అవగాహన కల్పించేందుకు వారికి అర్థమయ్యే విధంగా వీడియోలు, కార్యక్రమాలు రూపొందించాలని ఆదేశించారు. స్థానిక వెదురు వంటి వనరులను వినియోగించి ఆరోగ్య సంరక్షణకు అనువైన వస్తువులు తయారు చేసే శిక్షణ ఇవ్వాలని సూచించారు. శిశువులకు మొదటి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలు అందించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని, దీనిపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. శిశు మరణాల నియంత్రణకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, విధానాల అమలు, వైద్య సేవలు అందించే విషయంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు.

సమావేశం అనంతరం జిల్లా వ్యాప్తంగా క్షయవ్యాధి (టీబీ) నివారణ,అవగాహన కోసం రూపొందించిన గోడపత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య శాఖ అధికారి జయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా, వైద్య నిపుణులు, వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వెంకటాపురం గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం



**ఎర్రుపాలెం,నవభూమి,ఆగస్టు12:** మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో జిల్లా వైద్యశాఖ బనిగండ్లపాడు పీహెచ్సీ వైద్యులు డాక్టర్ ప్రశాంత్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు.ఈ వైద్య శిబిరంలో గ్రామస్తులకు బిపి,షుగర్ టెస్ట్ లను నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.డాక్టర్ ప్రశాంత్ మాట్లా డుతూ గ్రామస్తులు వర్షాకాలంలో తీసు కోవలసిన జాగ్రత్తలను వివరించారు.ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.డెంగ్యూ,మలేరియా వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసు కోవాలన్నారు.ఈ కార్యక్రమంలో జమలా పురం పిహెచ్సి వైద్యులు కుమారి,సాయి రెడ్డి,గ్రామ మాజీ సర్పంచ్ బొగ్గుల లక్ష్మీ రెడ్డి,రాజుపాలెం మాజీ సొసైటీ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి,రాజుపాలెం సొసైటీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, కర్నాటి సుధాకరెడ్డి,రమేష్, బొగ్గుల సత్య నారాయణ రెడ్డి, బూసుపల్లి జగన్మోహన్ రెడ్డి,ఏఎన్ఎం అరుణ, ఆశా వర్కర్లు వరలక్ష్మి, నాగమణి,సునీత తదితరులు పాల్గొన్నారు.

# వ్యాపారులూ ... నిఘా కెమేరాలు ఏర్పాటు చేయండి

### జూలూరుపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ లక్ష్మీ విజ్ఞప్తి





**జూలూరుపాడు, ఆగస్ట్ 12 (నవభూమి ప్రతినిధి)** జన సమ్మర్ధం గల ప్రాంతాలలో వ్యాపార సముదాయాల ఎదురుగా నిఘా కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలని జూలూరుపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ లక్ష్మీ వ్యాపారులకు సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎస్సై బాదావత్ రవి తో కలిసి మండల పరిధిలోని వర్తక వాణిజ్య వ్యాపారులతో మంగళవారం ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేసిన సందర్భంగా వ్యాపారులతో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశానుసారం నేర నియంత్రణకు నిఘానేత్రాలు ఎంతగానో ఉపయుక్తమని,నేర పరిశోధన లో ఖచ్చితత్వం తో కూడిన సాక్ష్యంగా నిలుస్తాయని,నిందితుల ఆచూకీ తెలుసుకొని పోయిన సొమ్మును రాబట్టుటలో తోడ్పడతాయని ప్రతి ఒక్కరు వాటి ఆవశ్యకతను గుర్తించి ఏర్పాటు చేసుకొని పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.శాంతిభద్రతల పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని ప్రతి ఒక్క పౌరుడు యూనిఫాం లేని పోలీసు గా భావించి,శాంతి భద్రతల పరిరక్షణలో తోడ్పాటు అందించి సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని సి ఐ ప్రజలకు పిలుపు నిచ్చారు.

# ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ : పుట్ట లక్ష్మణ్



**మేడిపల్లి, నవభూమి, ఆగస్టు 12** బోడుప్పల్లో ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ హాజరై శ్వేతారుణ పతాకావిష్కరణ చేసి ప్రసంగించారు. దేశ స్వాతంత్ర్యమే లక్ష్యంగా ఏర్పాటైన మొట్టమొదటి విద్యార్థి సంఘం. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో 1936 ఆగస్టు12న అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆవిర్భవించింది. పోరాటాలు, త్యాగాలే ధ్యేయంగా ఏర్పాటైన విద్యార్థి సంఘం స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వ విద్యా పరిరక్షణకై, శాస్త్రీయ విద్య, కామన్ విద్యావిధానం అమలుపై నిరంతరం పోరాటాలు సాగిస్తూ 90 సంవత్సరాలుగా విద్యార్థుల శ్రేయస్సు కోసం అశేష త్యాగాలు చేసింది. ఉద్యమాలే ఊపిరిగా పోరాటాలే ప్రాణంగా, విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, చదువుతూ పోరాడుతాం చదువుకై పోరాడుతాం అంటూ, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో, విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని వీరోచిత పోరాటం, ఓటుహక్కు ఉద్యమం, మలిదశ తెలంగాణ పోరాటం, హాస్టళ్ల సమస్యలపై, విద్య వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పాలకులపై అలుపెరుగని సమరశీల పోరాటాలు చేసి దేశంలో ఎన్నో విజయాలు సాధించిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్, ఉపాధ్యక్షులు హరీష్, మహేష్, ఆదిత్య, శివ, సాయి, అరవింద్, చిన్న, దుర్గ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రహదారి వెంట వృక్షాల సంరక్షణలో ఎంపిడిఓ రవి



**జూలూరుపాడు, ఆగస్ట్ 12 (నవభూమి ప్రతినిధి)-** కాదేదీ ప్రకటనలకు అనర్హం అంటూ ప్రధాన రహదారి పై పొలాల వెంట ప్రభుత్వం పెంచుతున్న చెట్లకు పురుగు మందులు విత్తన కంపెనీలు ప్రచారం నిమిత్తం బోర్డులను మేకులతో కొట్టి తీగల తో చుట్టి ప్రచారం చేస్తున్నారు. దీని వలన వృక్షాల పెరుగుదల మందగించటం గాలికి విరిగి పడుతున్నాయని గమనించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ వాటిని తొలగించాలని మండల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.దానిలో బాగంగా జూలూరుపాడు ఎంపీడీవో తాళ్లూరి రవి కార్యాచరణ ప్రారంభించారు. మంగళవారం రహదారి వెంట గల చెట్లకు ఉన్న బోర్డులను పెరికి వేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లకు మేకులు కొట్టొద్దు,తీగలు చుట్టొద్దని సంబంధిత కంపెనీలను హెచ్చరించారు.



మేకులు కొట్టడం వల్ల చెట్ల పెరుగుదలకు ఆటంకం ఏర్పడుతోంది. తీగలు కట్టిన చోట గాట్లు పడి, ఎదుగుదల లేక ఒక్కోసారి గాలి దుమారానికి విరిగి పడే ప్రమాదం ఉంది. చెట్లకు పెద్ద పెద్ద ప్రకటన బోర్డులు ఏర్పాటు చేయటంతో గాలులకు రోడ్డుపై పడిపోతూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వీటన్నింటికి నిలుపుదల చేయుటకు కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు. వృక్షాలకు ఉన్న ప్రకటన బోర్డులు, మేకులు, తీగలు తొలగించడానికి సర్వీసు టూ వనదేవత పేరిట వృక్షాలను కాపాడే ప్రయత్నం చేస్తున్నామని చెట్లకు హాని కలిగించవద్దని కోరారు. అధికార యంత్రాంగం చెట్లకు ఉన్న ప్రకటన బోర్డులు,తీగలు,మేకులు తొలగించే కార్యక్రమం ముమ్మరంగా చేపట్టినట్లు తెలిపారు. ఎం పి డి ఓ రవి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు వెంగన్నపాలెం, వినోబానగర్, సాయిరాంతండా,పడమట నరసాపురం ఏరియాల్లో రోడ్డు పక్కన ఉన్న చెట్లకు ఉన్న తీగలు, మేకులు తొలగించారు. ఈ ప్రక్రియ రెండు రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు.సమస్య పునరావృతమైతే సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకుంటామని రహదారి పక్కన వృక్షాలపై పంచాయతీ సిబ్బంది అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

# కామేపల్లిలో ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం

- అనేక మంది జీవితాల్లో వెలుగులు నింపిన పుస్తక భాండాగారం గ్రంథాలయం
- పుస్తక పఠనం మానవాళి అభివృద్ధికి తొలి మెట్టు
- లైబ్రేరియన్ ఎస్.లలిత కుమారి
- గ్రంథాలయాలను ప్రజలు వినియోగించుకోవాలి
- స్పెషల్ ఆఫీసర్ బి.తారా దేవి

**కామేపల్లి, నవభూమి,ఆగష్టు 12 :** జాతీయ గ్రంథాలయ దినోత్సవంను కామేపల్లి శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎస్.లలిత కుమారి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహిం చారు.ఈ సందర్భంగా గ్రంథాలయ దినోత్సవ విశిష్టతను పాఠకులు,చందాదారులు,గ్రామస్తు లకు వివరించారు.గ్రంథాలయ సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని గ్రంథాలయ అభివృద్ధికి పాటుపడాలని కోరారు.అనేకమంది జీవితాల్లో వెలుగులు నింపిన భాండాగారం గ్రం థాలయం అన్నారు.పుస్తక పఠనం మానవాళి అభివృద్ధికి తొలి మెట్టని మండల వ్యవసాయ శాఖ అధికారి,కామేపల్లి పంచాయతీ స్పెషలా ఫీసర్ బి.తారా దేవి అన్నారు.విజ్ఞానంతో పాటు వినోదమును పొందేందుకు గ్రంథాలయాలు వేది



కలుగా నిలుస్తాయి అన్నారు.గ్రంథాల దినోత్సవం సందర్భంగా గ్రంథ పాలకురాలు లలిత కుమారికి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం గ్రంథాల యం ఆవరణలో లైబ్రేరియన్ లలిత కుమారి, ఏవో తారా దేవి, ప్రముఖ సామాజికవేత్త,జాతీ య ఉత్తమ అవార్డు గ్రహీత చిలుముల రమేష్ మొక్కలు నాటారు.నాటిన మొక్కలకు నీళ్లు పో సి రక్షణ కవచాలను ఏర్పాటు చేశారు.మొక్కలు నాటడం సామాజిక బాధ్యత అన్నారు.మానవా ళి మనుగడకు మొక్కలే మూలాధారం అన్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విరివిగా మొక్కలు నాటి పచ్చద నాన్ని పెంపొందించి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంను అందించి ప్రగతి పథంలో పయ నించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆదర్శ రైతు కొమ్మినేని భద్రయ్య, జర్పల రమేష్, తులసి, మదార్, రుక్మిణి, రఘుపతి తదితరులు పాల్గొన్నారు

# నా ఇల్లు కూల్చిన స్థలంలో నిర్మించిన రాజీవ్ గృహ కల్పలో ఇళ్ళు కేటాయించండి

- రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించిన బాధితురాలు వెంకటమ్మ

**కంటోన్మెంట్, నవభూమి ప్రతినిధి, ఆగస్టు 12:** తమ ఇళ్ళను కూలగొట్టిన స్థలం లో నిర్మించిన రాజీవ్ గృహకల్ప లో నాకు ఇళ్ళు కేటాయించాలని సికింద్రాబాద్ హమాలి బస్తికి చెందిన దళిత మహిళ వెంకటమ్మ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ ను ఆశ్రయించింది.మంగళవారం నాడు బాధితురాలు వెంకటమ్మ డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అధ్వర్యంలో మంగళవారం డాక్టర్ బి.అర్.అంబేద్కర్ సచివాలయం లో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీ నివాస్ రెడ్డి చాంబర్ లో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ను కలిసి వినతిపత్రం సమర్పించారు. చైర్మన్ వెంటనే స్పందించి హైదరాబాదు జిల్లా కలెక్టర్ కు ఇళ్ళు కేటాయించాలని రాత పూర్వకంగా



ఆదేశాలు జారి చెస్తానని హామి ఇచ్చారు. అదె విధంగా ప్రజాభవన్ లో నిర్వహించిన ప్రజా వాణిలో ప్రజావాణి ఒఎస్డి దివ్య దేవరాజన్ కు వినతిపత్రం సమర్పించగా ఆమె స్పందించి సికింద్రాబాద్ ఆర్డిఓ సాయి కుమార్ తో పొన్ లో మాట్లాడి ఇళ్ళు కేటాయించాలని కొరారు. ఈ సందర్భంగా వెంకటమ్మ మాట్లాడుతూ సికింద్రాబాద్ హమలిబస్తిలో నా ఇళు ళ్లను కూల్చివేసి అ స్థలం లో రాజీ వ్ గృహా కల్ప పథకం కింద ఇండ్లను నిర్మించారని తెలిపారు. నా ఇళ్ళు కూల్చివేత సమయంలో నాకు రాజీ వ్ గృహ కల్ప ఇళ్ళు ను ఇస్తామని అధికారులు హామి ఇచ్చి ప్రస్తుతం ప్రకటించిన ఇండ్ల కేటాయించిన లిస్ట్ లో నా పేరు లేదని ఆవెదన వ్యక్తం చేశారు.